# 3

# తూర్పు దేశపు జ్ఞానుల సందర్శనము

## (2:1-12)

యేసు జీవితంలోని తొలి సంవత్సరములకు సంబంధించినంత వరకు మత్తయి రాసిన సువార్త 2వ అధ్యాయం చదువువారికి కొంత సంక్షిప్త వివరములను సమకూర్చుచున్నది. ఏదిఏమైనా, లూకా రాసిన సువార్తవలె గాక (లూకా 2:1–38), యోసేపు మరియ దంపతులు నజరేతులో నివసించుట, యేసు బేత్లెహేములో జన్మించినప్పుడు నెలకొని యుండిన పరిస్థితులు, గొఱ్ఱెల కాపరులు సందర్శనము, యేసునకు సున్నతి చేయబడుట, లేదా ఈ కుటుంబమంతా కలిసి యెరూషలేము దేవాలయమునకు వెళ్లుట గూర్చి మత్తయి ఏమియు తెలియజెప్పుటలేదు. మత్తయి సువార్త 2వ అధ్యాయంలో రాయబడియున్నట్లు తూర్పు దేశపు జ్ఞానుల సందర్శనము ఈ సంఘటనలన్నియు సంభవించి ముగిసిన తదుపరి సంభవించి యుండవచ్చును.

ఈ అధ్యాయంలో అనేక కీలకమైన ఇతివృత్తములు కనుగొనబడుచున్నవి. బాలుడైన యేసు యూదుల నిజమైన రాజుగాను, ఆరాధింపబడుటకు ఆయనే యోగ్యుడనియు చిత్రీకరింపబడుచున్నాడు. ఈయన నియంతయైన రాజైన హేరోదుకు, మెస్సీయాను హతమార్చవలెనని అతడు పన్నిన దుష్ట పన్నాగము దైవికమైన జోక్యము వలన వమ్ముచేయబడినవారికి, వ్యతిరేకముగా నిలువబడియున్నాడు. దేవదూతలు చేసిన హెచ్చరికల ద్వారా, ఆయన కుమారుడు సురక్షితముగా కాపాడబడుచున్నాడని దేవుడు నిశ్చయపర్చుకొనుచున్నాడు. యేసు పుట్టిన స్థలము, బేత్లెహేము నుండి, తన స్వస్థలమైన నజరేతునకు గల మధ్యంతర మార్పు విషయంలో ఒక ముఖ్యమైన వివరణ కలదు.[1] ఈ స్థలముల పేర్లు ఈ అధ్యాయానికి ఎటువైపు నుండి చూచినా ఆసరగా ఉంటూ ప్రయోజనపడుచున్నవి (1:1, 23). యేసు జీవితంలోని సంఘటనలు, ప్రవచనము యొక్క నెరవేర్పుగా దృష్టించబడుచున్నవి.

### తూర్పు దేశపు జ్ఞానులు యెరూషలేము చేరుకొనుట (2:1, 2)

**[1]రాజైన హేరోదు దినములయందు యూదయదేశపు బేత్లెహేములో యేసు పుట్టిన పిమ్మట ఇదిగో తూర్పు దేశపు జ్ఞానులు యెరూషలేమునకు వచ్చి [2]–యూదుల రాజుగా పుట్టినవాడెక్కడ నున్నాడు? తూర్పుదిక్కున మేము ఆయన నక్షత్రము చూచి, ఆయనను పూజింప వచ్చితిమని చెప్పిరి.**

**వచనము 1**. దీనికి ముందున్న వచనము, అనగా మత్తయి 1:25, మరియు "కుమారుని కనెను" అని అతి తక్కువ మాటల్లో స్పష్టంగా ప్రకటించుచున్నది. 2వ అధ్యాయం మొదట్లో, **యేసు యూదయ దేశపు బేత్లెహేములో జన్మించెనని** మత్తయి వర్ణించుచున్నాడు. యోసేపు మరియు మరియ బేత్లెహేములో ఎందుకున్నారో లూకా వివరించుచున్నాడు. "కురేనియు సిరియ

దేశమునకు అధిపతియై యున్నప్పుడు, సర్వలోకమునకు ప్రజా సంఖ్య రాయబడవలెనని” కైసరు ఔగుస్తు ఆజ్ఞాపించాడు. యోసేపు బేత్లెహేము వాస్తవ్యుడు గనుక, ప్రజా సంఖ్యలో రాయబడుటకు అతడు ఈ పట్టణమునకు రావలసి వచ్చినది (లూకా 2:1-5). బేత్లెహేము, యెరూషలేమునకు దక్షిణాన ఆరు మైళ్ల దూరములో నున్న ఒక చిన్న నగరమై యున్నది. అదే పేరుతో జెబూలూను భూభాగములో నున్న మరొక పట్టణము (యెహోషువ 19:15, 16) నుండి దానిని ప్రత్యేకంగా గుర్తించుటకు అది “యూదా” అను పేరు బహుశ రాజరికమైన యూదా గోత్రమును నొక్కివక్కాణించుటకు కూడ వాడబడి యుండవచ్చును (ఆదికాండము 49:10).

“బేత్లెహేము” అనగా “రొట్టెల ఇల్లు” అని అర్థము, ఈ పేరు ఆ ప్రదేశములోని నేల యొక్క సారవంతమునుబట్టి పెట్టబడియుండును. క్రీ.పూ. 1500 నాటి గొప్ప వారసత్వ స్వాస్థ్యముండిన నగరము, బేత్లెహేము రాజైన దావీదు యొక్క జన్మస్థలమై యుండెను (1 సమూయేలు 17:12-15). ఈ చోటుకు సమీపంలోనే తన కనిష్ట కుమారునికి జన్మనిచ్చుచు రాహేలు మృతిచెందినది (ఆదికాండము 35:16-20; 48:7). బోయజు మోయాబీయురాలైన రూతును కలిసికొని అటుతరువాత ఆమెను వివాహమాడిన స్థలము కూడ బేత్లెహేమే (రూతు 1:1, 22; 2:4; 4:13). రెహబాము, సొలొమోను కుమారుడు, తన పరిపాలనా కాలములో ఈ పట్టణము యొక్క భద్రత కొరకై దానిని మరింత పటిష్ఠంచేసాడు (2 దినవృత్తాంతములు 11:6). బబులోను చెరనుండి కొందరు యూదులు అచ్చటికి తిరిగి వచ్చారు (ఎజ్రా 2:21; నెహెమ్యా 7:26).

చక్రవర్తియైన కాన్‌స్టాంటన్, 325లో, ఇచ్చట తన తల్లి, రాణియైన హెలెన, క్రీస్తు పుట్టిన స్థలమని అనుకున్న ఒక గుహపై ఒక దేవాలయమును నిర్మించాడు.[2] (ప్రాచీన కాలములో గుహలు అశ్వశాలలుగా ఉపయోగింపబడినవి.) ఈ సాంప్రదాయమునకు ప్రాచీన కాలము నాటి మూలము కలదు, అది జస్టిన్ మార్టియర్ (c. 100-c. 165) కాలమంత ప్రాచీనమైనది.[3] కేవలము అదొక సాంప్రదాయమై యున్నదని అంగీకరించుచు, ఈ గుహను “ఆయన పుట్టిన ప్రస్తుత పుణ్యక్షేత్రము, ఎక్కువ ప్రామాణికమైన పవిత్ర స్థలములలో ఒకటై యున్నదని” జాక్. పి. లూయిస్ పిలిచాడు.[4] ఏదిఏమైనా, ఈ గుర్తింపు కచ్చితము కాదు.

యేసుక్రీస్తు **హేరోదు** మహారాజు పరిపాలనా కాలములో జన్మించాడు. హేరోదు, అంతిపయ అను పేరున్న ఇదూమియుని కుమారుడై యుండెను, ఇతనిని కైసరు ఔగుస్తు యూదా దేశమునకు అధిపతిగా నియమించాడు. ఇతని తల్లి, కుప్రియ, పాలస్తీనాకు నైరుతి దిశలో ఉండిన రాజ్యము నుండి వచ్చిన అరబ్బు నాబాతు సంతానమునకు చెందినదై యుండెను. క్రీ.పూ. 47లో, హేరోదును గలిలయ ప్రాంతమునకు చతుర్థాధిపతిగా నియమించవలెనని అంతిపయ, కైసరును ఒత్తిడి చేశాడు. పార్తీయులు పాలస్తీనాపై దాడిచేసినప్పుడు, హేరోదు ఐగుప్తుకు పారిపోయాడు. అటుతరువాత అతడు రోమా పట్టణమునకు వెళ్లిపోయాడు, అచ్చట, క్రీ.పూ. 40లో - మార్కు అంతోనీ ప్రభావము ద్వారా యూదులకు **రాజుగా** ఘోషింపబడ్డాడు. రోమా ప్రభుత్వము సహాయముతో, అతడు పాలస్తీనాపై దాడిచేశాడు. యుద్ధము జరిగిన కొద్ది సంవత్సరముల తరువాత, క్రీ.పూ. 37లో అతడు పార్తీయులను తరిమివేసి తన రాజ్యమును స్థాపించుకొన్నాడు. అదే సంవత్సరములో, హేరోదు పరిపాలపలించుచుండిన భూభాగము యొక్క సరిహద్దును కైసరు ఔగుస్తు విస్తరించాడు గనుక ఈ విస్తరణ దాదాపుగా

పాలస్తీనా దేశమంతటిని చుట్టుముట్టినది.[5] క్రీ.పూ. 37 మొదలుకొని క్రీ.పూ. 4 వరకు కొనసాగిన అతని పరిపాలన, గొప్ప భవంతుల నిర్మాణ పనులు కార్యక్రమములు, రాజకీయ కుతంత్రములు, దొంగచాటుగా చంపివేయుట, హింసాకాండ మొదులగు విషయాలకు పేరుగాంచినదయ్యింది ఎవ్వరైనగాని అన్యాయంగా ఆక్రమించుకొనవచ్చునని ఎందుకు భయపడుచుండెనో, ఇటువంటి పోటి ఏర్పడకుండా నిరోధించగలుగునట్లు ఎందుకింత తీవ్రమైన చర్యలు చేపట్టదలచుచుండెనో మనము సులభంగా అర్థంచేసికొనవచ్చును. తూర్పు దేశపు జ్ఞానులు యెరూషలేమునకు వచ్చినప్పుడు రాజైన హేరోదు ప్రతిస్పందించిన తీరును గూర్చి ఆర్. వి. జి. టాస్కర్ ఇలా రాయుచున్నాడు, “జ్ఞానుల రాక ఫలితంగా రాజైన హేరోదు బహు గొప్పగా కలవరము చెందియుండును, ఏలయనగా దుష్ట స్వభావముగల ఆ నియంత యూదుల గుంపులోనే పోటీపడుచుండిన ఒక రాజున్నాడను విషయము గూర్చి ప్రశాంతముగా నున్న మనస్సుతో లోతుగా యోచించుననునది లోకములో ఆఖరి అంశమే ఔతుంది.”[6]

శిశువైన యేసును ఆరాధించుటకు **తూర్పు దేశము నుండి వచ్చిన జ్ఞానుల గూర్చి** అనేక ప్రశ్నలు తలెత్తుచున్నవి. వారు “జ్ఞానులై” యుండిరా, “జ్యోతిష్య శాస్త్రజ్ఞులై” యుండిరా, “గారిడివారా,” లేక “రాజులా”? వారు యూదులా లేక అన్యజనులా? వచ్చినవరెంతమంది? కచ్చితంగా, వారెచ్చోట నుండి వచ్చారు? క్రీస్తు కొరకు వెదకుచు వచ్చిన వారు యెరూషలేమునకు ఎప్పుడు చేరుకొన్నారు? మొదలగు వారి గుర్తింపు “జ్ఞానులు” అను పదము “జ్ఞానముగల వారు” (KJV), “జ్యోతిష్య శాస్త్రజ్ఞులు” (NEB), మరియు “నక్షత్రములను అధ్యయనము చేసినవారు” (TEV) అని నానావిధములుగా అనువదింపబడిన గ్రీకు పదమునకు ప్రతిలేఖనము చేయబడిన పదమై యున్నది. గ్రీకు పదమునకు సంబంధించినంతవరకు, లియోన్ మోర్రిస్ ఇలా రాయుచున్నాడు,

> మేగోస్ [*Magos*], మేగోయ్ జాతికి చెందిన సభ్యుడని అర్థమిచ్చినదని ఆదిలో కనిపించినది; అటుతరువాత అది పవిత్రమైనదిగా పరిగణింపబడిన ఒక కులమునకు చెందిన సభ్యుని సందర్భములో, మేగోయ్‌ల అభ్యాసములను కొనసాగించిన వాని సందర్భములో ప్రయోగింపబడినది, అటుతరువాత మొత్తంమీద మాంత్రికుల విషయంలో వాడబడినది (అపొస్తలుల కార్యములు 13:6, 8). “మేజిక్” అను పదము మనకు దొరకిన మూలము యిదే.[7]

యేసును సందర్శింప వచ్చిన జ్ఞానులు మాదీయులలోని పౌరోహిత్య సంబంధమైన వర్గములో (యాజకత్వ వర్గములో) భాగమై యుండవచ్చును, కానీ “విజ్ఞులు” అను పదము ఇతర తూర్పు దేశపు తత్త్వవేత్తలైనవారికి కూడ వర్తింపజేయబడుచుండెను. ఈ జ్ఞానులు/విజ్ఞులు ఖగోళశాస్త్రం, జ్యోతిష్యం, మరియు సోదె చెప్పుటతో సంబంధము కలిగియుండినవారు కావచ్చును. వీరు మాదీయులలో ఒక జాతికి చెందినవారని హెరోడోటస్ పేర్కొన్నాడు, కానీ వీరిని పారసీక దేశపు సంస్కార విధుల సంబంధములో సహితము పేర్కొన్నాడు.[8] ఇటువంటి మత విధానం నెలకొనియుండి భవిష్యత్ “జ్ఞానులను” ప్రభావితము చేసియుండగా, మత్తయి ద్వారా పేర్కొనబడిన ఈ మనుష్యులు నిజముగా ఎవరై యుండిరో పరిష్కారముగా ఋజువు పర్చుటకు మనకు మరొక మార్గమేదియును లేదు.

ఏదిఏమైనా, ఈ జ్ఞానులు రాజులు కారని చెప్పుకొనుట క్షేమకరము. హెరోడోటస్ ప్రకారము, విజ్ఞులైన వీరి తెగకు చెందినవారు పారసీక రాజుల పాలనను పరిసమాప్తి నొందించుటకు

ప్రయత్నించారు.[9] కానీ వారి ప్రయత్నం విఫలమైనప్పుడు, వారు కలిగియుండిన రాజకీయ అభిలాషలన్నిటిని తెంచుకొన్నారు. వారు ఆధ్యాత్మిక నాయకులుగాను పారసీక దేశపు రాజులకు సలహాదారులుగాను ఉండుటతో సంతృప్తిచెందారు. వేదాంతియైన టెర్టుల్లియన్ (రెండవ శతాబ్దము ముగింపు కాలంలో)[10] ఎంత ప్రాచీనమైనవాడో యేసును సందర్శింప వచ్చినవారు రాజులై యుండిరను అభిప్రాయము కూడ అంతే ప్రాచీనమైన విషయమై యున్నది గనుక (యెషయా 60:3–11; కీర్తనలు 68:29; 72:10, 11, 15; ప్రకటన 21:24 వంటి) పరిశుద్ధ బైబిలులోని కొన్ని వాక్య భాగములను తప్పుగా అర్థంచేసికొనుట వలన ఈ అభిప్రాయం ఏర్పడుచున్నది. ప్రజాదరణ పొందిన క్రీస్తు జయంతి పాటలోని ఒక పదబంధము గూర్చి, విల్యమ్ హెండ్రిక్సెన్ ప్రత్యేకంగా ఇలా చెప్పుచున్నాడు, " 'తూర్పు దేశపు జ్ఞానులము' అను పంక్తి, 'చిన్ని క్రీస్తేసు ఏడ్వలేదు' అను పంక్తి చెందియున్న అదే పురావృత్త సంబంధమైన క్రీస్తు జయంతి పాండిత్య గ్రంథ సంసయమునకే చెందియున్నది."[11]

*వారి మూలము.* వీరు ఎవరై యుండిరో అనునది ఎంతగా హేతువుకు అందని విషయమై యున్నదో, వీరు ఎక్కడ నుండి వచ్చిరో అనునది కూడ అంతే మర్మమైనదిగా ఉంటున్నది. ఉపసర్గికమైన "తూర్పు నుండి" అను పదము అనిశ్చితముగా నున్నది. ఈ పదమును అక్షరార్థముగా తీసికొన్నట్లయితే, "సూర్యుడు ఉదయించు దిశ నుండి" అని అర్థమిచ్చుచు అది ఆసియాను సూచించును. హెచ్. లియో బోల్స్ ఇలా రాస్తున్నాడు, "'తూర్పు' అను పదము అరేబియా, పర్షియా, కల్దీయ లేక పార్థీయా మరియు పాలస్తీనను ఆనుకొనియున్న ప్రదేశమలై యుండవచ్చును.[12] కనీసము ఆది సంఘ రచయిత, జస్టిన్‌మార్టియర్ (c. 100–c. 165) ఈ జ్ఞానులు అరేబియా నుండి వచ్చినవారని స్వాధికారంతో పలికాడు.[13] వారు పర్షియా/పారసీక దేశము నుండి వచ్చారని అలెగ్జాండ్రియాకు చెందిన క్లెమెంతు (c. 150–c. 215) మరియు క్రిసోస్తం (c. 347–407) మొదలకొని ఇతరులనేకులు చెప్పారు.[14]

*వారి నిర్దిష్ట జాతి/భాష.* "జ్ఞానులు" సాంప్రదాయకంగా అన్యజనులని భావింపబడ్డారు.[15] డగ్లస్ అర్. ఏ. హేర్ ఇలా చెప్పుచున్నాడు, "వారి గూర్చిన ప్రశ్న, వారి మూలము మరియు వారి వృత్తి మొదలగు అన్నీ, వారు అన్యజనులని తెలియజెప్పుచున్నది: దావీదు యొక్క గొప్ప ఉత్తరాధికారి దావీదు పట్టణములో జన్మించవలసి యున్నదని వారికి కచ్చితంగా తెలియజెప్పబడవలెను."[16] విషయము ఇదే అయినట్లయితే, యేసుక్రీస్తు ఉపయోగించుకొని యుండును (1:3పై గల వ్యాఖ్యానమును చూడుము).

అట్లయినప్పటికిని, యేసును సందర్శించుటకు వచ్చినవారు అన్యజనులై యుండిరనునది నిశ్చయముగా తెలియుటలేదు. "జ్ఞాని"/"విజ్ఞుడు" అను మాట, వెనుకటి రోజుల్లో మాయమంత్రముతోను వంచనతోను సంబంధము కలిగియుండి, వివిధ చక్రవర్తులకు సలహాదారులుగా సేవలందించిన వారిని వర్ణించుటకు ఉపయోగింపబడినది. దానియేలు, చెరగా పట్టబడిన ఒక యూదీయుడు, బబులోనులో ఇలా గౌరవింపబడిన వారిలో ఉండెను (దానియేలు 2:1–12, 27, 48, 49; LXX) ఈ జ్ఞానులు తూర్పు దేశము నుండి వచ్చారను వాస్తవము సహితము వీరు అన్యజనులై యుండిరని ఋజువు చేయదు, ఏలయనగా యూదులు క్రీ.పూ. ఎనిమిదవ శతాబ్దము మొదలుకొని ఆరవ శతాబ్దము వరకు విదేశాల్లో చెదరిపోయి యుండిరి. అనేకులు అష్షూరు పట్టణమునకు, "మాదీయుల పట్టణములకు," మరియు బబులోనుకునూ దేశబాహిష్కృతులు గావింపబడిరి (2 రాజులు 17:6; 24:15; ఎస్తేరు

1:1; 9:2). పెంతెకొస్తు దినాన, అచ్చట ఉండినవారిలో కొందరు, యూదులై యుండిరని స్పష్టముగా తెలియుచున్నవారు (అపొస్తలుల కార్యములు 2:5), "పార్తీయులు, మాదీయులు, ఏలామీయులు, మరియు మెసపొతమియ దేశ వాస్తవ్యులై యుండిరి" (అపొస్తలుల కార్యములు 2:9). ఈ ప్రాంతములన్నిటిని కూడ తూర్పు దేశపు ప్రాంతములని పరిగణింపవచ్చును.

*వారి సంఖ్య.* సరిగ్గా ఎంత మంది జ్ఞానులుండిరి? వారర్పించిన మూడు కానుకలనుబట్టి (2:11) వారు ముగ్గురై యుండిరను నమ్మకము కలుగుచున్నది.[17] ఇంతేగాక వారికి – మెల్కియోర్, బెల్తాసర్, మరియు జాస్పర్ – అను పేర్లు కూడ పెట్టబడినవి, ఆరవ శతాబ్దమునాటి గ్రీకు ప్రమాణ గ్రంథములో మాత్రమే వాటి జాడ దొరకుచున్నది.[18] జ్ఞానుల సంఖ్య అంతగా పట్టించుకొనదగిన విషయం కాదు, కానీ వారు వచ్చిన హేతువు దాని ప్రాముఖ్యతను ఉన్నత శిఖరాలను తీసుకొని వెళ్లుచున్నది: వారు క్రొత్త రాజును ఆరాధించుటకు వచ్చారు.

*చేరవలసిన స్థలమునకు వారు చేరుకొనుట.* జ్ఞానులు పాలస్తీనాకు వచ్చిన తరువాత, అచ్చట నుండి **యెరూషలేము** పట్టణమునకు వెళ్లారు. డోనాల్డ్ ఏ. హేగ్నర్ ఇలా వ్యాఖ్యానిస్తున్నాడు,

> ప్రధాన యాజకులు మరియు శాస్త్రుల చేత ఉల్లేఖించి చెప్పబడిన మీకా గ్రంథంలోని వాక్యభాగముతో ఈ జ్ఞానులు సుపరిచితులుకారని స్పష్టమగుచున్నది, గనుక క్రొత్త రాజు ముఖ్యపట్టణములో జన్మించునని సహజంగానే వారనుకొందురు. అందుచేతనే వారు "యెరూషలేమునకు" వెళ్లారు. వారు హేరోదు నొద్దకు వెళ్లవలెనని ఆయన యొద్దకు వెళ్లలేదు కానీ వారు వచ్చిన సద్దేశమును తెలిసికొనిన తరువాత వారాయన యొద్దకు పిలువబడిరి (వచనము 3).[19]

ఈ జ్ఞానులు బేత్లెహేమునకు ఎప్పుడు చేరుకొన్నారు? చిన్న పశువులు తొట్టిలో బాల యేసు పరుండి యుండుట, ఆయన తల్లిదండ్రులు ఆయన గూర్చి అతి జాగ్రత్తతో మెలగుచున్నట్లుండు సన్నివేశము గల చిత్ర పటములను మనము సర్వసాధారణంగా చూస్తుంటాము. అక్కడే ఉన్న కొన్ని పశువులు ఆయన వైపు చూస్తుంటాయి, గొఱ్ఱెల కాపరులుంటారు, "ముగ్గురు జ్ఞానులు" కూడ ఉంటారు. ఆనాటి విషయం అది కాదు. జ్ఞానులు యేసు ఉండిన చోటికి చేరుకొన్న నాటికి, ఆయన బేత్లెహేములో జన్మించి అప్పటికి అనేక మాసములు, బహుశా ఒక సంవత్సరము లేదా అంత కంటె ఎక్కువ కాలము గతించిపోయింది (లూకా 2:1-20). జ్ఞానులు యేసు ఉండిన చోటికి చేరుకొన్నప్పుడు, కుటుంబము ఒక "ఇంటిలో" నివసించుచుండినదని మత్తయి మనకు తెలియజెప్పుచున్నాడు (2:11).

**వచనము 2.** జ్ఞానులు యెరూషలేములో ప్రవేశించిన తరువాత, వారు యేసు ఉండిన చోటు గూర్చిన భోగట్టాను సేకరించుటకు వెంటనే మొదలుపెట్టారు. వారు **యూదుల రాజుగా పుట్టినవాడెక్కడ నున్నాడు**? అని వాకబుచేయుచుండిరి. "చెప్పిరి" అని 2:1 చివరగల మాట కొనసాగుచున్న చర్యను సూచించుచున్న ఒక వర్తమాన క్రియావిశేషమై యున్నది. వారు ఒక్క మారు మాత్రమే అడుగలేదు; వారు పట్టణమందంతటను అనేక పర్యాయములు ఈ ప్రశ్న వేశారు. అయితే వారు ప్రత్యేకించి ఈ ప్రశ్ననే అడుగాలని వారికెలా తెలియును? వారు చూచిన నక్షత్రమునకు సంబంధించిన ప్రవచనమును వారు ఎరిగియుండినట్లు విదితమగుచున్నది (సంఖ్యాకాండము 24:17), అట్లయినను మెస్సీయ జన్మస్థలమునకు సంబంధించిన ప్రవచనము గూర్చిన వివరము వారికి తెలియదు (మీకా 5:2). ఆది కాలమందలి రోమా

దేశ రచయితలు రచించిన చారిత్రాత్మక ఋజువు ఒక యూదీయ పరిపాలకుడు త్వరలో రానైయున్నాడని ఆ రోజుల్లో ప్రబలియుండిన ఒక అపేక్ష గూర్చి సాక్ష్యమిచ్చుచున్నది. ఈ ప్రవచనము యొక్క ముందెలివి ఒక గొప్ప రాజు చేత పరిపాలింపబడు ఒక సార్వత్రిక సామ్రాజ్యమును కంటికి ఎదురుగా ఉన్నట్లు ఊహించుకొన్నది.[20] లూయిస్ గమనించిన విషయమేమనగా, " 'యూదుల రాజుగా పుట్టిన వాని' గూర్చి జ్ఞానులు అడుగుచుండిన ప్రశ్న (cf. 27:11) హేరోదు విషయంలో, రాజ భవనమును గూడుపుఠానీ, కుతంత్రము, మరియు ప్రత్యర్థులను నిర్మూలించుటకు కత్తి శక్తిని ప్రయోగించుకొనినవానికి, ఒక తారతమ్యమును సూచించుచున్నది."[21]

క్రొత్తగా పుట్టిన రాజు ఎక్కడ ఉన్నాడని జ్ఞానులు అడుగుచు, **తూర్పు దిక్కున మేము ఆయన నక్షత్రము చూచితిమని** వారు వివరించారు. కొన్ని అనువాదములలో "తూర్పు దిక్కున" అను మాటలకు బదులుగా, "అది ఉదయించు దిశలో" లేదా ఇటువంటిదే మరొక పదజాలము రాయబడి యున్నది. డబ్ల్యు. ఎఫ్. ఆల్‌బ్రైట్ మరియు సి. ఎస్. మన్ ప్రకారము, "మనము కలిగియున్నది, జ్ఞానులు గమనించిన అసాధారణమైన ఒక దృగ్విషయము యొక్క ఆరంభమును సూచించుచున్న సాంకేతిక వ్యక్తికరణమై యున్నది. క్రైస్తవ్యమునకు మునుపటి సాహిత్యము లోని గ్రీకు పదము [*anatolē*] ఉదయించుచున్న సూర్యుని మరియు ఇతర నక్షత్రములను సూచించుచున్నది."[22] హేగ్నర్ ఇలా చెప్పుచున్నాడు, "గొప్ప వ్యక్తుల జననము (మరియు మరణము). ఆకాశంలో ఒక నక్షత్రము లేదా అటువంటి దివ్యమైన దృగ్విషయము కనిపించుట ద్వారా (ప్రజలందరికి తెలియునట్లు విస్తృత పరిధిలో) ప్రకటింపబడినదని సామాన్యంగా భావింపబడుచుండినది. సమాంతరములు మత్తయి తెలియజేయుచున్న కథావివరము నేడు మన కాలమునకు అన్యమైన అంశమై యుండని విధంగానే, అది ఆయన నాటి కాలములో కూడ అన్యమైన అంశమేమీ కాదని చూపించుచున్నవి."[23]

సంఖ్యాకాండము 24:17 మత్తయి చేత పేర్కొనబడినప్పటికిని, జ్ఞానులు చూచిన "నక్షత్రము" ఈ వాక్యభాగములో నున్నట్లు అది బిలాము పలికిన ప్రవచన నెరవేర్పైయున్నదని సామాన్యంగా నమ్మబడుచున్నది: "నక్షత్రము యాకోబులో ఉదయించును, రాజదండము ఇశ్రాయేలులో నుండి లేచును" అది మెస్సీయకు సంబంధించిన ప్రవచనమను అర్థవివరణ యూదుల[24] చేతను మరియు క్రైస్తవుల[25] చేతును ఒకే రీతిలో చెప్పబడుచున్నది. నక్షత్రము గూర్చి పాత నిబంధనలోని సంఖ్యాకాండము 24:17లో రాయబడియున్న ప్రవచనమును జ్ఞానులు ఎలా తెలిసికొన్నారు? వాస్తవమునకు, వారు మెస్సీయ కొరకు ఎదురుచూచుచుండినట్లు ఎందుకు అంత దూరం ప్రయాణం చేశారు? వీరు అన్యజనుల విశ్వాసుల సమూహమునకు చెందినవారై యుండిరా? వారు దానియేలు వంటి బాధ్యతాయుతమైన పాత్రలు వహించిన యూదులై యుండిరను విషయము క్రమవిరుద్ధమైన సాధ్యత యని మనము దానిని సంపూర్తిగా కాదనగలమా? ఈ ప్రశ్నలకు సమాధానములు మనకు ఎన్నటికిని దొరకకపోవచ్చును. పరిశుద్ధ బైబిల్ సంబంధమైన అంతర్గత ఋజువు నిర్ధారణకరమైనదిగా లేనప్పుడు బహిర్గత నిదర్శనముల ఆధారంగా మనము ఒక తుది అభిప్రాయమును ఏర్పరచుకొనుట అపాయకరమే.

కంటికి కనబడిన నక్షత్రమును మనము కాదనగలమా? దీనికి వివరణ ఏమిటి? ప్రఖ్యాతిగాంచిన ఒక ఖగోళశాస్త్రజ్ఞుడు, జోహన్నెస్ కెప్లర్ (1571-1630), 1603లో

మరియు 1604లో శనిగ్రహము మరియు శుక్ర గ్రహముల కలయికను గమనించాడు, మరియు ఒక సంవత్సరము తరువాత, అంగారకుడు వాటితో కలిసినట్లు గమనించాడు. ఈ దృగ్గోచరము ప్రతి ఎనిమిది వందల సంవత్సరములకు ఒక సారి మాత్రమే సంభవించును. కెప్లర్ గుర్తించినదేమనగా, ఇది జరిగినప్పుడు, తేజోమయమైన ఒక నక్షత్రము శుక్రుడు మరియు శని గ్రహములకు నడుమ కనిపించును. గనుక క్రీస్తు జననమునకు సమీప సమయములో ఇదే జరిగియుండుననియు, జ్ఞానులు చూచినది ఈ నక్షత్రమనియు ఆయన నేర్చుకొనిన దాని నుండి సిద్ధాంతీకరించాడు.

మరొక ఖగోళశాస్త్రజ్ఞుడు, కార్ల్ వియెస్లర్ (1813–1883), క్రీస్తు జన్మించిన కాలమునకు దగ్గరలోనే ఆకాశంలో ఒక క్రొత్త నక్షత్రం కనిపించినట్లు ఖగోళశాస్త్రమునకు సంబంధించిన చైనా దేశీయుల పట్టికలు వాస్తవంగా గ్రంథస్థంచేసాయని వాదించాడు. ఇంకా ఇటీవలనే, చైనీయులు రికార్డుల ఆధారంగా క్రీ.పూ. 5లో ఒక తోక చుక్క కనిపించినదనియు, అది ఏడు రోజుల వరకు కనిపించిందనియు – తూర్పు దేశపు జ్ఞానులు ప్రయాణం చేసి బేత్లెహేమునకు వచ్చుటకు సరిపడు ఒక సహేతుకమైన సమయము – కోలిన్ హంఫ్రేసే కూడ వాదించాడు.[26]

దాదాపు క్రీ.పూ. 11లో హేలీ తోక చుక్క కనిపించినదనియు, అది ఆకాశంలో ఒక చార/గీత వలె కనిపించుచుండినదనియు ఇతరులు చెప్పుచున్నారు. జ్ఞానులు కనుగొన్న యేసు ఉండిన ఇంటి మీద నిలుచుటకు ఒక ఉల్క కదలివచ్చినదను అభిప్రాయమును మరి కొందరు ఇతరులు ఎంచుకొనుచున్నారు. అది క్రీ.పూ. 5–2 మధ్య కాలంలో అసాధారణముగా కనిపించిన "ఖగోళశాస్త్ర సంబంధమైన ఒక దృగ్గోచరమై యుండినదని" విల్యమ్ బార్క్లే గుర్తించాడు. "ఒక యువరాజు జననము" అని అర్థమిచ్చు ఐగుప్తీయుల నెల "మెసోరి" యొక్క మొదటి దినాన డాగ్ స్టార్ సిరియస్ "సూర్య సంబంధముగా ఎగసినది, అనగా సూర్యోదయ సమయంలో మహామాన్యమైన కాంతితో ప్రకాశించినది."[27] జాన్ మెక్అర్థర్ జూ., "అది దేవుని మహిమయై యుండును – గొఱ్ఱెల కాపరులకు క్రీస్తు జననము గూర్చి దేవదూత చేత ప్రకటింపబడినప్పుడు వారి చుట్టు ప్రకాశించిన అదే మహిమ (లూకా 2:9) అని భావించుచు," "నక్షత్రమును పరిశుద్ధ సత్యవేదము గుర్తించుటలేదు లేక దాని గూర్చి వివరించుట లేదు, గనుక మనము వితండవాదము చేయజాలమని" చేర్చుచున్నాడు.[28]

క్రీస్తును **ఆరాధించుట** తూర్పు దేశపు జ్ఞానులు వచ్చిన ఉద్దేశమై యుండినది. "ఆరాధించుట" యను అర్థమిచ్చు గ్రీకు పదము (*proskuneō*) మత్తయి రాసిన సువార్తలో పదమూడు పర్యాయములు కనిపించుచున్నది (2:2, 8, 11; 4:9, 10; 8:2; 9:18; 14:33; 15:25; 18:26; 20:20; 28:9, 17). "ముద్దుపెట్టుకొనుట" మరియు "వైపు" అర్థమిచ్చు రెండు పదములు నుండి ఉత్పన్నమైనందున, "వ్యక్తుల ముందర సాష్టాంగపడి వారి పాదములను లేదా వస్త్రపుటంచును, నేలను, మొదలుకొని ముద్దుపెట్టుకొను వాడుక" అని *proskuneō* సూచించుచున్నది. అనగా, "ఒకరికి ప్రణామము చేయుట, ఒకరి యెదుట సాష్టాంగపడుట, ఒకరిని పూజించుట" అని అర్థము.[29] అది మత సంబంధమైన ఆరాధనయను భావము నీయనవసరము లేదు. జ్ఞానులు ఒక రాజును వెదుకుటకు వచ్చారను వాస్తవము వారు రాజకీయ మర్యాదలు చేయుటకు వచ్చారను ధ్వనింపు నీయవచ్చును. ఏదిఏమైనా, ఈ శిశువు గుర్తింపును గూర్చి వారికి ఎరుకై యుండినదని కనిపించుచున్న ఎరుకనుబట్టి, అది

ఆధ్యాత్మిక ఆరాధనయై యుండినదనే విషయమును మనము కాదనలేము. గ్రంథ పాఠము సహితము దీనికి ఊతనిచ్చుచున్నట్లు కనిపించుచున్నది.

### హేరోదు మత నాయకులను పిలిపించుట (2:3–5)

**3హేరోదురాజు ఈ సంగతి విన్నప్పుడు అతడును అతనితో కూడ యెరూషలేము వారందరును కలవరపడిరి. 4కాబట్టి రాజు ప్రధాన యాజకులను ప్రజలలోనుండు శాస్త్రులను అందరిని సమకూర్చి – క్రీస్తు ఎక్కడ పుట్టునని వారినడిగెను. 5అందుకు వారు – యూదయ బేత్లెహేములోనే; ఏలయనగా**

**యూదయదేశపు బేత్లెహేమా**
**నీవు యూదా ప్రధానులలో**
**ఎంతమాత్రమును అల్పమైనదానవు కావు;**
**ఇశ్రాయేలను నా ప్రజలను పరిపాలించు అధిపతి నీలోనుండి వచ్చును**

**అని ప్రవక్తద్వారా రాయబడియున్నదనిరి.**

**వచనము 3.** "యూదుల రాజుగా పుట్టినవాడెక్కడ నున్నాడు" అని జ్ఞానులు పలికిన మాటలు ఆయన విన్నప్పుడు, **హేరోదు కలవరపడెను.** హేరోదు గూర్చి మనకు తెలిసిన దానినిబట్టి, ఆయన ఆందోళనను అర్థం చేసికొనుట మాత్రము కష్టమైన విషయం కాదు. ఆయన రాజ్య పరిపాలన అధికారాన్ని తన చేతపట్టుకొని, రాజ్యములో శాంతి సమాధానములను అత్యంత కఠినమైన పద్ధతుల ద్వారా మాత్రమే కాపాడుకొనుచుండెను. ఆయనకు శత్రువులు, ముఖ్యంగా ఆయన పరిపాలించుచుండిన యూదులలోనే, ఎంతో మంది ఉండిరి. ఆయనతో పోటీ పడుటకు యూదీయ ప్రత్యర్థి ఒకడు పుట్టాడను ఆలోచనయే ఆయనలో అసూయను మరియు ఒక రకమైన చిత్త భ్రమను పురికొల్పినది.

వారందరు హేరోదుతో కలిగియుండిన స్నేహమునుబట్టి **అతడును అతనితో కూడ యెరూషలేము వారందరును** కలవరపడిరి అని తెలియజెప్పబడుచున్నది. పరిపాలనలో ఒక మార్పు వచ్చుటకు యెరూషలేము నివాసులలో కొందరు ఇష్టపడరనునది నిజమై యుండగా, ఎప్పుడో ఒకప్పుడు సంభవించుటకు అవకాశమున్న ఈ అంశమును అనేకులు నిరీక్షించుచుండిరి. యూదులకు రాజుగా పుట్టిన వాని గూర్చిన ఈ వార్త తెలిసిందంటే హేరోదు యొక్క నిరంకుశత్వము ఎటువంటిదో అదివరకే వారు ఎన్నో సంఘటనలు కళ్లారా చూశారు, గనుక ఆయన పరిపాలనకు బెదిరింపు ఎదుగుచున్నదని హేరోదు నమ్మినట్లయితే, ఎటువంటి ఘోరాతి ఘోరమైన పరిణామములు ఏర్పడవచ్చునోయని వారు భయపడుచున్నారంటే ఆశ్చర్యము లేదు. మెక్ అర్థర్ ఇలా రాయుచున్నాడు,

> ప్రజానీకం యొక్క ఆందోళన ప్రత్యక్షంగా జ్ఞానులను గూర్చినది కాదు, కానీ హేరోదు వారి యెడల కనుపర్చు ప్రతిస్పందన గూర్చినదే యుండుట అత్యంత సంభావ్యమై యున్నది. హేరోదు కలవరము చెందుచున్నాడంటే సాధారణంగా అది ఉన్మాదముతో కూడిన రక్తపాతముగా పరిణమించునని వారనుభవించిన చేదైన అనుభవములనుబట్టి వారెరిగియుండిరి. ఆయన జాగ్రత్తగా పరిశీలించి తన అసలు శత్రువులెవరో గుర్తించుట గూర్చి పట్టించుకొనలేదు. ఎవరైనా సరే, ఆయనకు హాని చేయబోవుచున్నారని లేక ఆయన

> స్థానమునకు లేదా అధికారమునకు బెదిరింపుగా ఉంటున్నారని ఆయనకు ఏ మాత్రం అనుమానం కలిగినా, వాడు ఆలోచింపదగినంత ఆపాయములో ఉన్నాడన్నట్లే, ఆయన జరిగించిన విస్తృతమైన మారణహోమంలో తరుచుగా అనేక మంది బొత్తిగా అమాయకులై యుండినవారు నాశనమగుచుండిరి. ప్రజలు వారి సొంత భద్రత గూర్చి కలిగియుండిన భయము బహుగా సహేతుకమైనదై యుండెను.[30]

"హేరోదు మహా రాజు వణకిపోయినప్పుడు, పట్టణమంతా ఝుళిపింపబడింది" అని మోర్రిస్ చెప్పుచున్నాడు.[31]

**వచనము 4**. హేరోదు భక్తిపరుడు కాకాపోయినప్పటికిని, యూదీయ లేఖనములు మరియు సాంప్రాదాయములు అతనికి అత్యంత సుపరిచితమే అని అతడు ప్రఖ్యాతిగాంచి యుండెను. మెస్సీయా రాకడకు సంబంధంచిన ప్రవచనములు గూర్చి ఎంతో కొంత ఎరిగియుండెనని స్పష్టమగుచున్నది. ఏది ఏమైనా, ఆయనకు మీకా పలికిన ప్రవచనము తెలిసియుండలేదు (2:6) **మెస్సీయ ఎక్కడ జన్మించునో** ఎరిగియుండలేదు గనుక, వారికి తెలిసియుండునని ఆయన అనుకొన్నవారిని, అనగా **ప్రధాన యాజకులను ప్రజలలో నుండు శాస్త్రులు**ను పిలిపించాడు.

హేరోదు సంప్రదించినవారందరు అత్యధికంగా సన్హెడ్రిన్ అని పిలువబడుచుండిరనియు యూదుల మహాసభ సభ్యులై యుందురు. "ప్రధాన యాజకులు మరియు శాస్త్రులు" ఈ మహాసభలోని వేదాంత శాస్త్ర విభాగమునకు సంబంధించినవారై యుండిరి. మహాసభకు సంబంధించిన "పెద్దలు" ఇచ్చుట పేర్కొనబడలేదు గనుక ఇది సన్హెడ్రిన్ మహాసభ సభ్యులందరు కూడుకొనవలెనని ఉద్దేశింపబడినది కాదని హేగ్నర్ వాదించుచున్నాడు.[32]

"ప్రధాన యాజకులలో" ప్రస్తుతము పరిపాలించుచుండిన ప్రధాన యాజకుడు, మాజీ ప్రధాన యాజకులు, మరియు ప్రధాన యాజకులు ఎన్నుకొనబడిన కుటుంబముల నుండి వచ్చినవారు కూడ ఉండియుండవచ్చును (అపొస్తలలు కార్యములు 4:6 చూడుము). లూయిస్ ఇలా వివరించుచున్నాడు,

> చట్ట ప్రకారము యాజకుని పదవిలో ఒక్కరే కొనసాగినప్పటికిని, అది వంశపారంపర్యముగా వచ్చుచుండినది, మరియు ఒకని జీవితకాలమంతయు కొనసాగినది, గనుక హేరోదుకు సంబంధించిన రాజకుమారులు మరియు రోమా అధికారులు వారి ఇష్టానుసారంగా ఎప్పుడనుకుంటే అప్పుడే యాజక పదవిని చేపట్టుచుండిరి మరియు ఆ పదవి నుండి తొలగిపొవుచుండిరి. క్రొత్త నిబంధన కాలములో యాజక ధర్మములను నిర్వర్తించిన 28 మంది గల యాజకుల జాబితా నోకటి ఇచ్చుచు,జోసీఫస్ అర్చియెరెయిస్, (archiereis), (గ్రీకు) బహూవచనమును ఉపయోగించుచున్నాడు.[33]

చట్టప్రకారము, యాజకులు, లేవి వంశము మరియు అహరోను సంతానము నుండి మాత్రమే కావలసినవారై యుండిరి (నిర్గమకాండము 28:1; 29:9). ఇతర లేవియులందరును నేడు సంఘ పెద్దలకు సహాయము చేయుచున్న సంఘ పరిచారకుల వలెనే యాజకులకు వారి విధులలో తోడ్పడు పరిచారకులై యుండిరి. అహరోను సంతతిలో జ్యేష్ఠుడైనవాడు ఆయన తరువాతి ఉత్తరవాదియై యుండవలెను, గనుక అదే పద్ధతి ఆ కాలమందంతటను వ్యాపించి పాటించబడవలసి యుండినది (నిర్గమకాండము 29:29, 30; సంఖ్యాకాండము

20:28; 25:11-13; ద్వితీయోపదేశకాండము 10:6). క్రీస్తుకాలము నాటికి, ఇదంతా మారిపోయినది. ప్రధాన యాజకుని పదవి రోమీయులు మరియు హేరోదు సంబంధికులైన అధికారుల అధీనములో రాజకీయముగా నియామకమగునంతగా దిగజారిపోయినది. యేసు సిలువవేయబడినప్పుడు ఇద్దరు ప్రధాన యాజకులుగా నుండిరి: అన్న, చట్టబద్ధముగా యూదులు చేత ప్రధాన యాజకుడుగా నియామకమైనవాడని ఎంచబడినవాడు, మరియు కయప, అన్న యొక్క అల్లుడు, అన్న గద్దెదింపబడినప్పుడు రోమీయుల చేత నియమింపబడినవాడు (లూకా 3:2; యోహాను 18:13, 14, 24, 28).

"ప్రధాన యాజకుల" గుర్తింపు గూర్చి Joachim Jeremias కొంచము భిన్నముగా నున్న అర్థవివరణను ఇచ్చుచున్నాడు. ఋజువును పరీక్షించిన పిదప అతడు తన తుది అభిప్రాయమును ఇలా తెలియజేయుచున్నాడు,

> దేవాలయ నిర్వహణాధికారి, దేవాలయములో ఆరాధనలు జరిపించుటకును దేవాలయమునకు లోపలను వెలుపలను భౌతిక ఏర్పట్లు చేయుటకును బాధ్యుడై యుండినవాడు, ప్రధాన యాజకుని తరువాత అత్యంత ముఖ్యమైన యాజకుడుగాను, ముఖ్యులైన యాజకులందరికి పెద్దగాను ఉండెను. అతని తరువాత వారమంతటి వ్యవహారములను చూచుకొను యాజకుల నాయకుడు, ఎవరు విధుల్లో ఉంటే వారే, మరియు ఈ వారములో నాలుగు మొదలుకొని తొమ్మిదివరకుండిన దైనందిన వ్యవహారాలను చూచుకొనుచుండిన నాయకులు వచ్చారు ... దేవాలయమలో స్థిరముగా నియామకము చేయబడిన ప్రధాన యాజకులు యాజకత్వము మీద చట్టసమ్మతమైన అధికార పరిధి కలిగియుండిన ఒక నిర్దిష్టమైన సముదాయముగా ఏర్పడిరి మరియు ఈ సముదాయ సభ్యులు యూదుల మహా సభలో సభ్యులుగా మాత్రమే గాక, వోటు వేయుటకు హక్కుగలవారై యుండిరి.[34]

"శాస్త్రులు" వారి వృత్తినిబట్టి పాత నిబంధన పండితులై యుండిరి. వారు యూదుల న్యాయస్థానములకు సంబంధించిన అధికార దస్తావేజులను నిర్విహించుచు వాటిని కాపాడుచు, వాటిలో అనేకమైనవాటిని గ్రంథస్తం చేశారు. వారు నిర్వహించుచుండిన ఈ కర్తవ్యమునుబట్టి, వారు "ధర్మశాస్త్రోపదేశకులు" అని కూడ సంబోధింపబడిరి (మత్తయి 22:35; లూకా 5:17). సమాజమందిరములు స్థాపింపబడినప్పుడు (బబులోనుకు చెరగా కొనిపోబడిన కాలములో స్థాపింపబడినవని స్పష్టమగుచున్నది). విద్యనభ్యసించినవారి వర్గమొకటి అభివృద్ధియైనది. లేఖనములను భద్రముగా కాపాడుచు, వాటి నకలు రాయుచు, వాటిని వివరించుట వారి విధియై యుండినది. వారు సర్వసాధారణంగా లేఖనములు రాత పనికి ప్రత్యేకింపబడిన గదులలో పనిచేయుచుండిరి, అచ్చట ఒకరు అందరి యెదుట నిలువబడి లేఖన భాగములను చదువుచుండగా, రాతబల్లల యొద్ద నిలువబడి యుండు శాస్త్రులు ఆ మాటలు నకలు రాయుచుండిరి. ఈ ప్రతులు సమాజమందిరములలో పంపిని చేయబడి సంపూర్ణమైన లేఖన ప్రతిని ప్రతిఒక్కరు కలిగి యుండీవారు. ఉపదేశకులుగాను, పండితులుగాను, ఈ శాస్త్రులు పరిగణింపబడిరో మనము సులభంగా అర్థంచేసికోనవచ్చును (23:2, 6-8). హేరోదు చేత సంప్రదింపబడిన శాస్త్రులు యెరూషలేములో నివసించుచుండిరి; వారిలో కొందరు యూదులు మహా సభ సన్హెడ్రిన్‌లో సభ్యులై యుందురు.

"క్రీస్తు ఎక్కడ పుట్టును?" అని హేరోదు మహారాజు ప్రధాన యాజకులను శాస్త్రులను ప్రశ్నించాడు. మెస్సీయ రాకడ గూర్చిన ఎదురుచూపుల విషయమై హేరోదు కలిగియుండిన

గ్రహింపు మరియు లేఖనముల గూర్చిన అతని అజ్ఞానమును చూపించుచున్నది (యోహాను 7:25–27, 40–42).

**వచనము 5ఎ.** హేరోదు అడిగిన ప్రశ్నకు సమాధానాన్ని ఈ మత నాయకులు వెదుకవలసిన అవసరం లేకుండినది. అది వారికి తెలిసియుండినది గనుక లేఖన సంబంధమైన సమాధానాన్ని వారు హేరోదుకు వినిపించారు: **మెస్సీయ యూదయ దేశపు బేత్లెహేములోనే** జన్మించునని ప్రవక్తయైన మీకా ప్రవచించాడు. **ఏలయనగా ... అని రాయబడి యున్నది** అను సూత్రము మీకా ప్రవచనమునకు ముందుగా ప్రస్తావింపబడినది. “అని రాయబడి యున్నది” (*gegraptai*) అను పదజాలము మత్తయి రాసిన సువార్తలో అనేక పర్యాయములు అగుపించుచు, పాత నిబంధన ఉల్లేఖనమును పరిచయమును చేయుచున్నది (2:5; 4:4, 6, 7, 10; 11:10; 21:13; 26:24, 31).

**వచనము 5బి.** మీకా 5:2లో రాయబడియున్న ఉల్లేఖనము మూల హెబ్రీ భాషలోనుండి అనుకూలింపజేసికొనబడినది, అది ఇలా రాయబడి యున్నది:

> “బేత్లెహేము ఎఫ్రాతా, యూదావారి కుటుంబములలో నీవు స్వల్పగ్రామమైనను నా కొరకు ఇశ్రాయేలను నా ప్రజలను ఏలబోవువాడు నీలో నుండి వచ్చును. పురాతన కాలము మొదలుకొని శాశ్వత కాలము ఆయన ప్రత్యక్షమగుచుండెను.”

మత్తయి రాసిన సువార్తలో ఇలా రాయబడి యున్నది:

**యూదయదేశపు బేత్లెహేమా**
**నీవు యూదా ప్రధానులలో**
**ఎంతమాత్రమును అల్పమైనదానవు కావు;**
**ఇశ్రాయేలను నా ప్రజలను పరిపాలించు అధిపతి నీలోనుండి వచ్చును**
**అని ప్రవక్తద్వారా రాయబడియున్నదనిరి.**

“బెత్లెహేము ఎఫ్రాతా” ఆధునికముగా, “యూదా దేశపు బేత్లెహేమా” అని రాయబడినది. “యూదావారి కుటుంబములు,” యూదా ప్రధానలు”గా రాయబడినది. రాబర్ట్ హెచ్. గుండ్రి ఇలా సూచిస్తున్నాడు,

> హల్లులతో కూడిన హెబ్రీ గ్రంథ పాఠమునకు వెవ్వేరు అచ్చులను సమకూర్చుట ద్వారా “వేలకొలది” లేదా “కుటుంబికులు” అనుటకు బదులుగా “పరిపాలకులు” అని మత్తయి రాయుచున్నాడు (MT, LXX), ఈ విధంగా బేత్లెహేము అదివరకే మూర్తిమంతము చేయబడినట్లే (“బేత్లెహేమా”). దావీదు వంశములో ఆయనకు ముందున్నవారిపై యేసునకు గల ఉన్నత ఔన్నత్యమును రూఢిపర్చునట్లు మత్తయి కుటుంబములను మూర్తిమంతము గావించుచున్నాడు (1:6–11).[35]

అంతమాత్రమేగాక, “ఇశ్రాయేలను నా ప్రజలను పరిపాలించు అధిపతి” అను మాటలు బహుశా 2 సమూయేలు 5:2 నుండి కలుపుకొనబడి యుండవచ్చును. ఈ వాక్యభాగములను దావీదునకు సంబంధించినదై “ఇశ్రాయేలను నా ప్రజలను పరిపాలించు అధిపతి” అని కూడ పేర్కొనుచున్నది. (కాపరత్వముచేయబడుట గూర్చిన ఇతివృత్తమము మీకా 5:4లో కూడ గోచరించుచున్నది.) చివరిగా, మీకా 5:2లోని ముగింపు వదిలిపెట్టబడినది.

అనుకూలింపజేసికొనబడిన ఈ విషయములకు సంబంధించి, అర్. టి. ఫ్రాన్స్ ఇలా రాయుచున్నాడు, "ఉల్లేఖనములను మత్తయి స్వేచ్ఛగా ఉపయోగించుకొనుచున్నాడు, వాక్య భాగము యొక్క అన్వయింపును సూచించునంత చక్కగా ప్రయోగించుచున్నాడు."[36] మెస్సీయ, దేవుని ప్రజలను "కాయుచుండు" పరిపాలకుడు" అయియుండవలెను. "కాపరి" అను పదము పాత నిబంధనలో ఒక రాజును లేదా ఒక పరిపాలకుని సూచించుచున్న సామాన్య పదమై యున్నది (2 సమూయేలు 5:2-5; 7:4-7; యిర్మీయా 23:1-4; యెహెజ్కేలు 34:1-24).

ప్రధాన యాజకులు మరియు శాస్త్రులు ఈ ప్రవచనమును ఎరిగియుండినప్పటికిని, వారు తమంతట తామే వెళ్లి శిశువును కనుగొని ఆయనను ఆరాధించుటకు ఏమైనా ప్రయాసపడ్డారో లేదో మనకు తెలియదు. ఈ సందర్భములో, వారి ప్రతిస్పందన "బొత్తిగా ఉదాసీనతతో కూడినదై" యుండినదని చెప్పుచూ, "వారు సామాన్యంగాను, సంపూర్తిగాను యేసును నిర్లక్ష్యముచేయునంతగా దేవాలయ కృతులలోను వారి చట్టపరమైన చర్చలలోను వారు నిమగ్నమైపోయి యుండిరని బార్క్లే రచించుచున్నాడు."[37]

## జ్ఞానులను హేరోదు రహస్యముగా కలిసికొనుట (2:6-8)

**[6-7]అంతట హేరోదు ఆ జ్ఞానులను రహస్యముగా పిలిపించి, ఆ నక్షత్రము కనబడిన కాలము వారిచేత పరిష్కారముగా తెలిసికొని [8]-మీరు వెళ్లి, ఆ శిశువు విషయమై జాగ్రత్తగా విచారించి తెలిసికొనగానే, నేనును వచ్చి, ఆయనను పూజించునట్లు నాకు వర్తమానము తెండని చెప్పి వారిని బేత్లెహేమునకు పంపెను.**

**వచనములు 6, 7. హేరోదు జ్ఞానులను** పిలువనంపాడు. పరిస్థితులు ఎలా పరిణమించునో అను ఆందోళనతో కూడిన భయము ప్రజలలో మరి ఎక్కువ తలెత్తుటను నిరోధించవలనని ఉద్దేశించి ఆయన వారిని **రహస్యముగా** పిలపించాడు. ఇంత గొప్ప హాని కలుగునను హేతువు వాక్యభాగము సూచించవచ్చును. ఆయన తన మనస్సులోని అసలైన అభిమతమును బట్టబయలు చేయుటకు ముందడగువేయలేదు. "రహస్యముగా" అను పదము, ఆయన వారిని పిలిపించుట మరియు కలిసికొనుట రహస్యముగా జరిగినవను భావమును వ్యక్తము చేయుచున్నది. వారు మాత్రమే ఎరిగియుండిన సమాచారమును: **వారికి ఆ నక్షత్రము కనబడిన ఖచ్చితమైన కాలమును** వారిలో నుండి బయటికి రాబట్టుకొనవలెనని ఆయన ఆశించాడు. ఆ నాటికి శిశువు సరిగ్గా ఎంత వయస్సుగలవాడై యుండవచ్చునో అంచనా వేయుటకే ఆయన ఈ వివరమును తెలిసికొనగోరుటలో గల కారణమని కనిపించుచున్నది (2:16).

"రహస్యముగా" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*lathrai*) క్రొత్త నిబంధనలో నాలుగు పర్యాయములు మాత్రమే అగుపించును. మత్తయి రాసిన సువార్త మొదటి రెండు అధ్యాయాలల్లో రెండు పర్యాయములు అగుపించును. బహుశ నీతిమంతుడైన యోసేపు, మరియను అవమానపరచనొల్లక "రహస్యముగా" విడనాడ ఉద్దేశించినవానికిని (1:19), దుర్మార్గుడైన హేరోదునకును, క్రీస్తును హతమార్చగలగునట్లు జ్ఞానులను "రహస్యముగా" పిలిపించి వారిని కలిసికొనినవానికిని (2:7) మధ్య పరిశీలినకును అవగాహనకును అందని

క్లిష్టమైన తారతమ్యము ఉండవచ్చును.

**వచనము 8.** ఆయన జ్ఞానులను అడిగిన సమాచారమును తెలిసికొనిన తరువాత, వారు వచ్చిన పని మీద వారిని **బేత్లెహేమునకు** వెళ్లనంపాడు. వారు వెళ్లి ఆ **శిశువు** విషయమై జాగ్రత్తగా విచారించి తెలిసికొనగానే, ఆయన కూడ వెళ్లి **శిశువును పూజించునట్లు** వారు తిరిగి వచ్చి ఆ వివరములను ఆయనకు తెలియజెప్పాలని వారికి ఖండితముగా ఆదేశించాడు. హేరోదు గూర్చి మనకు తెలిసియున్న దాని ఆధారంగా, ఆయన వేషధారణ మరియు రెండు నాల్కల ధోరణి గూర్చి మనకు ఆశ్చర్యము కలుగునవసరములేదు. క్రీస్తును ఆరాధించవలెనను ఆశయే ఆయనకు లేదు; గనుక జ్ఞానులు ఆయన యొద్దకు తిరిగి రానందున ఆయనతో ఉండిన ప్రోత్సాహకమేమిటో బహు స్పష్టముగా బయటపడుచున్నది.

హేరోదు మహారాజు జ్ఞానులకిచ్చిన ఆదేశములకు సంబంధించినంత వరకు, ఫ్రాన్స్ ఈ క్రింది ముఖ్య విషయాలను గమనించాడు.

> ఈ విదేశీయులు సహకారముపై ఆధారపడి, విషయమేమిటో తెలిసిన తరువాత తన సైనికులను వారితో కూడ పంపి యుండెడివాడను ఆలోచన సందర్భంలో, చారిత్రాత్మకమైన హేరోదు మహా టక్కరివాడును నిర్దయుడైనవాడై యుండెనని కొన్ని పర్యాయములు తగిన ఆధారాలు లేకుండా ఆరోపింపబడును. కానీ ఆయనకు అవసరమై యుండిన సమాచారముతో వారు తిరిగి వస్తారనిగాని, అప్పుడు వారితో కూడ పంపబడు సైనికులు విహరించుచుండు దృశ్యము వారు ఆ శిశువును కనుగొనుటకు వారికి సంకటము కలుగజేస్తుందనిగాని సందేహించుటకు అతని యొద్ద ఏ హేతువైనను లేదు. సమాచారమును ఆశించుటలో నుండిన వేషధారణతో కూడిన అతని ప్రోత్సాహకము అతని పౌరులను వంచించి యుండకపోవచ్చును, కానీ అది అతనికి ప్రయోజనకరంగా ఉండునట్లు ఆ విదేశియులతో కలిసినప్పుడు విజయవంతంగా పనిచేయవచ్చును.[38]

## జ్ఞానులు బేత్లెహేమునకు చేరుకొనుట (2:9–12)

**9వారు రాజు మాట విని బయలుదేరి పోవుచుండగా, ఇదిగో తూర్పుదేశమున వారు చూచిన నక్షత్రమును ఆ శిశువు ఉండిన చోటికి మీదుగా వచ్చి నిలుచువరకు వారికి ముందుగా నడిచెను. 10–11వారు ఆ నక్షత్రమును చూచి, అత్యానందభరితులై యింటిలోనికి వచ్చి, తల్లియైన మరియను ఆ శిశువును చూచి సాగిలపడి, ఆయనను పూజించి, తమ పెట్టెలు విప్పి, బంగారమును సాంబ్రాణిని, బోళమును కానుకులుగా ఆయనకు సమర్పించిరి. 12తరువాత హేరోదునొద్దకు వెళ్లవద్దని స్వప్నమందు దేవునిచేత బోధింపబడినవారై వారు మరియొక మార్గమున తమ దేశమునకు తిరిగి వెళ్లిరి.**

**వచనము 9.** జ్ఞానులు వెంబడించిన **ఆ నక్షత్రము** సామాన్యమైనది కాదని ఈ వచనము ఋజువుచేయుచున్నది. జ్ఞానులు యెరూషలేములో ఉండిన సమయంలో అది వారి కంటికి కనిపించలేదు లేదా నిలకడగా ఒక చోట నిలిచిపోయి యుండినదని స్పష్టమగుచున్నది. వారు బేత్లెహేమునకు వెళ్లవలెనని బయలుదేరినప్పుడు, స్వర్గసంబంధమైన వారి మార్గనిర్దేశనము సహితము మరొక పర్యాయము వారికి ముందు నడుచుచు **ఆ శిశువు ఉండిన చోటికి మీదుగా వచ్చి నిలుచువరకు** కదలి వెళ్లుటకు మొదలు పెట్టినది. విశేషంగా విశిష్టమైనదై యుండిన ఈ నక్షత్రము జ్ఞానులను బేత్లెహేము వరకు, అంతేగాక శిశువుండిన ఇంటి వరకు కూడ

నడిపించినది. కళ్ల ముందే వారి కంటికి కనబడనట్లుండినదని జోహన్నెస్ కెప్లర్ మరియు కార్ల్ వియెస్లర్ అనుకొన్న దృగ్విషయము కాదని ఈ కదలిక ఋజువుచేయుచున్నది (2:2 పై రాయబడి యున్న వ్యాఖ్యానమును చూడుము).

**వచనము 10, 11. వారు ఆ నక్షత్రమును చూచి అత్యానందభరితులయ్యారు.** వారిని తూర్పు నుండి యూదయాకు నడిపించిన "నక్షత్రమును" చూచి జ్ఞానులు "ఆనందభరితులయ్యారు" అదే నక్షత్రము వారిని బేత్లెహేమునకు, వారి సుదీర్ఘ ప్రయాణము యొక్క గమ్యస్థానమునకు, వారు శిశువును చూడనై యుండిన చోటికి నడిపించినది. "అత్యానందభరితులై" అను పదజాలము జ్ఞానులు అనుభూతిచెందుచుండిన అనందము మరియు ఉత్తేజము ఎంత గంభీరమైనదై యుండినదో ఊద్ఘాటించుచు తెలియజెప్పుచున్నది. ఆనందము మరియు స్తుతిని గూర్చిన ఇటువంటి భాషయే బాప్తిస్మమిచ్చు యోహాను మరియు యేసు జననములను లూకా వివరించుచున్న కథలో కనబడును (లూకా 1:14; 44, 46, 47; 2:10, 14, 20).

జ్ఞానులు, యోసేపు, తల్లియైన **మరియ** ఆ **శిశువు** నివసించుచుండిన ఇంటిలోనికి ప్రవేశించారు. ఇదివరకు గమనింపబడినట్లుగా, ఇచ్చట పశువుల కొట్టము లేదా "పశువుల తొట్టి" గూర్చి పేర్కొనబడలేదు (లూకా 2:7). జ్ఞానులు యేసు పుట్టిన స్థలమునకు చేరుకొనుటకు కొంత సమయము పట్టినది (లూకా 2:1–20). వారి రాకడకు మునుపు కుటుంబికులు యెరూషలేము దేవాలయమును సందర్శించుట కూడ జరిగినది (లూకా 2:22–38). ఈ సందర్శనము మరియు శుద్ధిచేసికొనిన నలుబది దినముల తరువాత జరిగినది (లూకా 2:22; లేవీయకాండము 12:1–4 చూడుము). జ్ఞానులు, యోసేపు కుటుంబము యెరూషలేము దేవాలయమును సందర్శించుటకు ముందు వచ్చియుండినట్లయితే, వారర్పించిన విలువైన కానుకలు ఈ పేద దంపతులు "గువ్వల జతనైనను రెండు పావురములనైనను మించి" అర్పించగలగుటకు సహాయకరముగా ఉండేవే" (లూకా 2:23, 24; లేవీయకాండము 12:8 చూడుము) అని హెండ్రిక్సెన్ సూచించాడు.[39] అంతమాత్రమేగాక, లూయిస్ ఇలా చెప్పుచున్నాడు, "జ్ఞానులు సందర్శనము వెనువెంటనే ఈ కుటుంబము ఐగుప్తుకు వెళ్లిపోయినదను అభిప్రాయమును మత్తయి కలుగజేయుచున్నాడు."[40]

వారు చేరుకొన్న తరువాత, జ్ఞానులు **శిశువు యెదుట సాగిలపడి ఆయనను ఆరాధించారు** (2:2పై రాయబడిన వ్యాఖ్యానము చూడుము). వారు "ఆయనను" పూజించారు, కానీ ఆయన తలిదండ్రులను కాదను విషయము ముఖ్యముగా గమనింపదగినదై యున్నది. వీరు కేవలము క్రీస్తును కనుగొనుటకు వచ్చిన జిజ్ఞాసగల అన్యజనులై యుండిరను భావమును వారి చర్య ఖండించుచున్నదని అగుపించుచున్నది. వారు యూదులు, లేదా యూదులై యుండి ప్రభువునంగీకరించినవారు, లేదా యెహోవాయందు భయభక్తులుగలవారై యుందురను దృక్పథమునకు అది తోడ్పడుచున్నది.

ప్రాచీన ప్రపంచంలో, రాజవంశములకు **బహుమానములను** బహుకరించుట అదొక ఆనవాయితీ అయియుండినది. ఇటువంటి బహుమానములు తరుచుగా ఒక పక్షమువారు వారి కంటె గొప్పదైన పక్షమునకు లోబడుచు రాజభక్తి కలిగియుందురనుటకు గురుతులై యుండినవి. కాబట్టి, జ్ఞానులు సామాన్య పరిశీలకులను మించినవారై యుండిరని వారు తెచ్చిన కానుకలు సూచించుచున్నవి. పెట్టెలు, బహుమానములను దాచుకొని తీసుకొనివెళ్లుటకు

ఉపయోగింపబడిన డబ్బాలు/పాత్రలై యుండినవి – బహూశా “దాచబడిన ధనమున్న పెట్టెలు” అయియుండును. గ్రీకు పదము (*thēsauros*). “పద కోశము” అని అర్థమిచ్చు ఆంగ్లపదమునకు “thesaurus” పదము ఆలంబనగా నిలుచుచున్నది.

వారు మూడు కానుకలు తెచ్చారు: **బంగారము, సాంబ్రాణి మరియు బోళము**. బంగారము సాధారణముగా రాజులకు బహూకరింపబడినది (1 రాజులు 10:2, 10; 2 దినవృత్తాంతములు 9:20–24; యెషయా 60:9). “సాంబ్రాణి” అను పదమునకు “స్వచ్ఛమైన సుగంధ ద్రవ్యము” అనునది అక్షరార్థమై యున్నది, అది సాధారణంగా దక్షిణ అరేబియా దేశంలోని సున్నపురాళ్లపై పెరుగుచుండిన ఒక రకమైన *బోస్వెల్లియ* జాతికి చెందిన చెట్టు బెరడు నుండి (పిండబడిన రసము) తీయబడిన గుగ్గిలము లేక జిగురై యుండినది. దానిని కాల్చినప్పుడు వెలువడు ధూపము కలిగియుండు మధురమైనదియు సుగంధమైనదైన సువాసననుబట్టి, పూజా సమయంలో అది దేవునికి అర్పింపబడినది (నిర్గమకాండము 30:8, 34–38). దాని వలన శవము కుళ్లిపోకుండా భద్రపరచుటకు ఉపయోగింపబడు ద్రావకము, పరిమళ ధూపము వేయుట, కొన్ని ఔషదాలలో మౌలిక పదార్థముగా వాడబడుట వంటి ఇతర ప్రయోజనములు కూడ ఉండినవి. బోళము, అరేబియా దేశములోనే పెరుగుచుండు నీలిగోరింట వంటి ఒక చెట్టు నుండి తీయబడిన గుగ్గిలము లేక జిగురై యుండినది. ఇది పరిమళ తైలముగా తయారుచేయబడి, తరుచుగా పరుపులపై (సామెతలు 7:17), లేక వస్త్రములపై (కీర్తనలు 45:8) ఉపయోగింపబడినది. కొన్ని సుగంధ ద్రవ్యములలో కూడ ఒక అంశముగా వాడబడుచు అభిషేక తైలముగా ప్రయోజనకరమయ్యింది (నిర్గమకాండము 30:23–25), మరణించినవారి దేహములకు పూయుటకు కూడ ఉపయోగింపబడినది (యోహాను 19:39, 40). ఇది ద్రాక్షరసముతో కలుపబడి, శరీరమును మొద్దుబారజేయు మందుగా కూడ వాడబడినది (మార్కు 15:23). బోళము మరియు సాంబ్రాణి ఈ రోజుల్లో ఎక్కువ ఖరీదైనవి కావు, కానీ క్రీస్తు కాలములో అవి చాలా ఖరిదైన వస్తువులే అని జాక్. పి. లూయిస్ గుర్తించాడు.[41]

**వచనము 12.** వారు వచ్చిన బృహత్కార్యము ముగించుకొని బేత్లెహేము విడిచి **తిరిగి వెళ్లవద్దని జ్ఞానులు స్వప్నమందు దేవుని చేత హెచ్చరింపబడిరి**. శిశువుండిన చోటు గూర్చిన సమాచారమును వారు యెరుషలేములోని హేరోదుకు తెలియజేయకూడదని దేవుడు ఉద్దేశించియుండెను. తత్ఫలితంగా, **వారు మరియొక మార్గమున వారి స్వదేశమునకు వెళ్లిపోయారు**. దేవుడు తన ప్రజలతో సంభాషించుటకు పాత నిబంధనలోనైతేనేమి క్రొత్త నిబంధనలోనైతేనేమి తరుచుగా స్వప్నములు మాధ్యమమును ఉపయోగించుకొన్నాడు.[42] దేవుడు ఈ నాడు సహితము స్వప్నములు ద్వారా సమాచారమును తెలియజెప్పుచున్నాడని కొందరు ఉపదేశించుదురు. పెంతెకొస్తు దినాన, పరిశుద్ధాత్మ కుమ్మరింపబడుట యోవేలు ప్రవక్త ప్రవచించిన ప్రవచనము యొక్క నెరవేర్పై యున్నదని పేతురు వివరించాడు: “మీ కుమారులును మీ కుమార్తెలును ప్రవచించెదరు, మీ యౌవ్వనులకు దర్శనములు కలుగును. మీ వృద్ధులు కలలు కందురు” (అపొస్తలుల కార్యములు 2:17; యోవేలు 2:28 చూడుము). స్వప్నముల ద్వారా తెలియజేయబడినట్లుగానే, మొదటి శతాబ్దము నాటి ఆశ్చర్యజనకమైన సంఘ యుగములో స్పష్టముగా ఒక భాగమై యుండినది. కొంత మట్టుకు ఉండిన ఇవన్నీ కూడ యేసు క్రీస్తు యొక్క సంపూర్ణమైన ప్రత్యక్షత అనుగ్రహింపబడినప్పుడు రద్దుచేయబడినవి

(1 కొరింథియులకు 13:8–10 చూడుము). దేవుడు ఈనాడు మనతో ఆయన కుమారుడు మరియు ఆయన ప్రేరేపించిన ఆయన వాక్యము ద్వారా మాత్రమే మాటలాడుచున్నాడు (హెబ్రీయులకు 1:1, 2).

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

## జ్ఞానులు క్రీస్తు కొరకు వెదుకుట (2:1–12)

క్రీస్తును వెదుకుచూ తూర్పు దేశము నుండి వచ్చిన జ్ఞానులు ఈనాడు క్రీస్తును వెదుకుచున్నవారికి మాత్రమే గాక, అయనను అత్యంత సన్నిహితముగా అనుసరించవలెనని ఆశించువారికి సహితము ఒక గొప్ప మాదిరియై యుంటున్నారు.

*వారి వెదకులాట సానుకూలంగా లేకుండినది* (2:1). జ్ఞానులు అరేబియా దేశమునుండి వచ్చారో, లేక బబులోను లేదా పారసీక దేశము నుండి వచ్చారో, ఆయా దేశములతో నిమిత్తము లేకుండా, వారి ప్రయాణం మాత్రం ఒక సుదీర్ఘమైన ప్రయాణమై యుండినది. యెరూషలేము చేరుకొనుటకు వారు "ఫెర్టైల్ క్రిసెంట్" (Fertile Crescent – అర్ధచంద్రాకారములో టైగ్రిస్ మరియు యూఫ్రటిసు నదుల మధ్య నున్న భూభాగము – మెసొపొతమియ) చుట్టూర ప్రయాణం చేసియుందురు. క్రీస్తును వెదుకుటలో వారు తమ సమయము, ధనము, మరియు శక్తిని త్యాగం చేశారు. నిజమైన శిష్యత్వము ఇంతకు తక్కువేమీ కొరుటలేదని ఈనాడు క్రీస్తును వెదుకుచున్నవారు కనుగొందురు (లూకా 9:23).

*వారి వెదుకులాటలో వినయము అవసరమయ్యింది* (2:2). జ్ఞానులు యెరూషలేమునకు చేరుకొన్న తరువాత, అప్పుడే పుట్టిన రాజు ఎక్కడ నివసించుచుండెనో అని వారికి ఎదురైన అచ్చటి ప్రజలను అడుగుటకు మొదలుపెట్టారు. ఈనాడు సహితము యేసును వెదుకుచున్నవారు వినయముతో కూడిన హృదయము కలిగియుండి వారి కంటె ఎక్కువ ఎరుక ఉన్న పెద్దవారిని, ఇతరులను సంశయాత్మక ప్రశ్నలు అడుగుచు సమాధానములు పొందుకొనవలెను (అపొస్తలుల కార్యములు 8:30, 31).

*వారి వెదుకులాట ఒక కలవరమును సృష్టించినది* (2:3). జ్ఞానులు అడిగిన ప్రశ్న హేరోదును కలవరపర్చినది, ఆయనతో పోటీపడి సింహాసనమును ఆక్రమించు ప్రత్యర్థి ఒకరు బయలుదేరారని ఆయన భయపడిపోయాడు. దేశం యథాపూర్వ స్థితినే కొనసాగించుచు, హేరోదు యికమీదట దౌర్జన్యపూరితమైన పనులకు పూనుకొనుటను నిరోధింపవలెనని ఆశించుచుండిన ప్రజలను సహితము అది కలవరపర్చినది. అదే విధముగా, ఈనాడు ఒకరు యేసును వెదకినప్పుడు, కొన్ని పర్యాయములు అది వారి జీవిత విధానములతో సంతృప్తి చెందుచున్నవారిలో కలవరము కలిగించవచ్చును. ఎంతైనా, చీకటిని ఛేదించి దానిని బయలుపర్చునది వెలుగే కదా (ఎఫెస్సీయులకు 5:6–14).

*వారి వెదుకులాట లేఖనములను ఆధారము చేసికొనినది* (2:4–6). జ్ఞానులు అడిగిన ప్రశ్నకు సమాధానము చెప్పగలుగునట్లు – అప్పటికే ఆ ప్రశ్న యెరూషలేము పట్టణమందంతటను వ్యాపించినది – హేరోదు యూదీయ నాయకులను సంప్రదించాడు. క్రీస్తు బేత్లెహేములో జన్మించునని లేఖనములలో రాయబడి యుండిన వివరమును వారెరగి యుండిరి (మీకా 5:2). ఈనాడు క్రీస్తును వెంబడింపగోరువారు ఆయన గూర్చి సాక్ష్యమిచ్చు

లేఖనములను తప్పనిసరిగా సంప్రదించుచుండవలెను (అపొస్తలుల కార్యములు 17:11).

*వారి వెదుకులాట మరొక నకిలీ వెదుకలాటతో వంచింపబడినది* (2:7, 8). వారు క్రీస్తును కనుగొనిన తరువాత ఆ సమాచారమును అతనికి తెలియజెప్పుటకు వారు ఆయన యొద్దకు తిరిగి రావలెనని హేరోదు జ్ఞానులకు ఆజ్ఞాపించాడు. నటించుచునే, అప్పుడే పుట్టిన రాజును ఆయన కూడా ఆరాధించవలెనని ఆశించుచున్నాడని వారికి చెప్పాడు. అదే విధముగా ఈ నాడు యేసును వెదుకుచుండువారి ప్రోత్సాహకము పవిత్రమైనదై యుండకపోవచ్చును, జాగ్రత్త సుమా (చూడు ఫిలిప్పీయులకు 1:17).

*వారి వెదుకులాటకు ప్రతిఫలముగా వారు అత్యానందభరితులయ్యారు* (2:9, 10). జ్ఞానులు బెత్లేహేమునకు వెళ్లుటకై యెరూషలేము నుండి బయలుదేరనై యుండగా వారు అదివరకు తూర్పున చూచిన నక్షత్రము మరలా పునఃప్రత్యక్షమయ్యింది. వారు అత్యానందభరితులగుటకు గల హేతువు ఇదే. ఏలయనగా క్రీస్తు ఉండిన చోటికి వారు సమీపించుచుండిరనియు, వారి ప్రయాసము ఫలించనై యున్నదనియు తద్వారా వారు తెలిసికొన్నారు. యేసును వెదుకువాడు నీటి బాప్తిస్మము ద్వారా దేవుని బిడ్డయైనప్పుడు, అది నిజముగా అత్యానందమును అనుభూతిచెందుచుండు క్షణమై యుండును (అపొస్తలుల కార్యముల 8:35-39 చూడుము). జీవితములో ప్రతికూలతలు ఎదురైనప్పటికిని, వారు నిరంతరాయంగా ప్రభువునందు ఆనందించుచుండవలెనని క్రైస్తవులకు పిలుపు ఇవ్వబడుచున్నది (ఫిలిప్పీయులకు 4:4-7).

*వారి వెదుకులాట రాజును ఆరాధించుటతో ముగిసినది* (2:11, 12). జ్ఞానులు బేత్లెహేములో యేసు ఉండిన ఇంటిలోనికి ప్రవేశించినప్పుడు, సాగిలిపడి యేసును పూజించుట వారి తొలి సహజ ప్రవృత్తియై యుండినది. అటుతరువాత, వారు అయనకు విలువైన కానుకలు - బంగారము, సాంబ్రాణి, మరియు బోళము - అర్పించారు. ఈనాడు చివరకు యేసును కనుగొనువారు వారి శేష జీవితమును క్రీస్తు ఏమైయున్నాడో, ఆయన చేసిన, చేయుచున్న మేళ్లను స్మరణకు తెచ్చుకొనుచు ఆయనకు కృతజ్ఞతతో స్తుతించుటలో గడుపవలెను (చూడు ప్రకటన 5:8-14).

డేవిడ్ స్ట్యూవర్ట్

**యేసును వెదుకుటలో గల జ్ఞానము (2:1, 2)**

యేసు క్రీస్తు పుట్టిన నాట నుంచి కూడా ప్రతి శతాబ్దములోను, జ్ఞానముగల స్త్రీపురుషులు ఆయనను వెదుకుచునే యున్నాయి. మనకు జ్ఞానము కొదువగా ఉన్న యెడల, మనము దాని కొరకు ఆయనను అడుగవలెను (7:7, 8; యాకోబు 1:5-8).

యేసును కనుగొనుటకు దైవికమైన మార్గనిర్దేశనము అవశ్యమై యున్నది. జ్ఞానులు, లేఖనములు మరియు వారికే ఒక ప్రత్యేకమైన ప్రత్యక్షతయై యుండిన నక్షత్రము చేత నడిపింపబడిరి. వంచించుచుండిన అనుభూతులు, వారి సొంత మనసాక్షులు, లేదా మానవ జ్ఞానము చేత నడిపింపబడలేదు.

దైవికమైన మార్గనిర్దేశకము ఈనాడు సహితము మనకివ్వబడినది - దేవుని వాక్యము (కీర్తనలు 119:105; యోహాను 17:17; అపొస్తలుల కార్యములు 20:32). అది సంపూర్ణమును, అన్నిటికి చాలినదియునైయున్న మార్గనిర్దేశనమై యున్నది (2 కొరింథీయులకు 3:5, 6;

2 తిమోతి 3:16, 17 చూడుము), గనుక మనము దేవుని దృష్టికి చాలినవారమగునట్లు ఆ వాక్యమును సంపూర్ణముగా అనుసరించుచుండవలెను.

---

సూచనలు

[1]ఈ సంబంధనమును వ్యవస్థాపింపవలసిన అవసరత యోహాను 7:40–44లోని చర్చనుబట్టి ఏర్పడినది. యేసే "ఆ ప్రవక్త"యై (మెస్సీయయై) యుండెనని కొందరు యూదులు అనుకొన్నారు, కానీ యేసు గలిలయ నుండి వచ్చినవాడను వాస్తవము ఆధారంగా వాధించారు. [2]Eusebius *Life of Constantine* 3.41-43. [3]Justin Martyr *Dialogue with Trypho* 78; see Origen *Against Celsus* 1.51. [4]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 46. [5]Josephus *Antiquities* 14.9.2; 14.14.1-14.16.4. [6]R. V. G. Tasker, *The Gospel According to Saint Matthew,* Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1975), 37. [7]Leon Morris, *The Gospel According to Matthew,* Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 35, n. 6. [8]Herodotus *History* 1.101, 132, 140. [9]Ibid., 1.101; 3.61-119, 126-141, 150-160. [10]Tertullian *Against Marcion* 3.13.

[11]William Hendriksen, *New Testament Commentary: Exposition of the Gospel According to Matthew* (Grand Rapids, Mich.: Baker Book House, 1973), 152. [12]H. Leo Boles, *A Commentary on the Gospel According to Matthew* (Nashville: Gospel Advocate Co., 1936), 37. [13]Justin *Dialogue with Trypho* 106. [14]Clement of Alexandria *Stromata* 1.15; Chrysostom *Homily on the Gospel According to St. Matthew* 7.1. [15]పాశ్చాత్య సంఘంలో "ఎపిఫని" పండుగను (జనువరి 6) మహూత్సవముగా జరుపుకొనుట నాలుగవ శతాబ్దము నాటి చరిత్ర కలిగియున్నది. "ఆయనను సందర్శించుటకు వచ్చిన జ్ఞానుల ద్వారా క్రీస్తు తనను అన్యజనులకు అగపర్చుకొనిన విషయమును" అది స్మరణకు తెచ్చును. (Elizabeth A. Livingstone, ed., *The Concise Oxford Dictionary of the Christian Church* [New York: Oxford University Press, 1977], 175.) [16]Douglas R. A. Hare, *Matthew*, Interpretation (Louisville: John Knox Press, 1993), 13. [17]ప్రిస్కిల్ల నేలమాళిగలో భద్రము చేయబడిన 'కపెల్ల గ్రెక'లోని అత్యంత తోలి రోజులకు సంబంధించిన ప్రాతినిధ్యం వారు ముగ్గురని చూపించుచున్నదని Lewis చెప్పుచున్నాడు. పేతురు మరియు మార్సెల్లినస్ యొక్క నేలమాళిగలో ఉండిన అటుతరువాతి రంగు చిత్రము. ఇద్దరిని చూపించుచున్నది (Lewis, 44). [18]*Excerpta Latina Barbari* 51b. [19]Donald A. Hagner, *Matthew* 1-13, Word Biblical Commentary, vol. 33A (Dallas: Word Books, 1993), 27. [20]Suetonius *Vespasian* 4.5; Tacitus *Annals* 5.13.

[21]Lewis, 44. [22]W. F. Albright and C. S. Mann, *Matthew*, The Anchor Bible (Garden City, N.Y.: Doubleday & Co., 1971), 12. [23]Hagner, 25-26. అతడు Alexander the Great, Mithridates, మరియు Alexander Severus యొక్క ఉదాహరణములను ఉదహరించి చెప్పాడు. (Cicero *On Divination* 1.23.47; Justin *History* 37.2; Lampridius *Alexander Severus* 12; Origen *Against Celsus 1*.59 చూడుము.) [24]*Damascus Rule* 7.19, 20; *War Rule* 11.6; *Testament of Levi* 18.3; *Testament of Judah* 24.1. క్రీ.శ. 132–135 నాటి యూదీయ విప్లవములో Bar Kosba (బహుశా, "ఒక యౌవన పొట్టేలు కుమారుడు") తన నామధేయమును Bar Kokhbaగా ("ఒక నక్షత్రము కూమారుడు") మార్చుకొని యుండును. [25]Justin *Dialogue with Trypho* 106; Irenaeus *Against Heresies* 3.9.2; Origen *Against Celsus* 1.58-59. 2 పేతురు 1:19; ప్రకటన 22:16 చూడుము. [26]Colin Humphreys, "The Star of Bethlehem," *Science and Christian Belief* 5 (October 1995): 83-101. [27]William Barclay, *The Gospel of Matthew,* vol. 1, 2d ed., The Daily Study Bible (Philadelphia: Westminster Press, 1958), 17. [28]John MacArthur, Jr., *The MacArthur New Testament Commentary: Matthew 1-7* (Chicago: Moody Press, 1985), 29. [29]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature*, 3d ed., rev. and ed. Frederick W. Danker (Chicago: University of Chicago Press, 2000), 882. [30]MacArthur, 31.

[31]Morris, 37. [32]Hagner, 28. [33]Lewis, 45; Josephus *Antiquities* 20.10.1 చూడుము. [34]Joachim Jeremias, *Jerusalem in the Time of Jesus*, trans. F. H. and C. H. Cave (Philadelphia: Fortress Press,

1969), 180. [35]Robert H. Gundry, *Matthew: A Commentary on His Literary and Theological Art* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 83. [36]R. T. France, *The Gospel According to Matthew*, The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 83. [37]Barclay, 21. [38]France, 84. [39]Hendriksen, 170. [40]Lewis, 47.

[41]Ibid., 48. [42]ఆదికాండము 20:3-7; 28:10-17; 31:10-13, 24; 37:5-11; 40:1-23; 41:1-36; న్యాయాధిపతులు 7:13-15; యోబు 33:14-16; దానియేలు 2; 7; మత్తయి 1:20, 21; 2:13-15, 22, 23; 27:19 చూడుము.